# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంతో ద్వైపాక్షిక సహకారంపై సమీక్షించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఫోన్ సంభాషణ జరిపారు.
- ❖ రబీ పంటల కనీస మద్దతు ధరల పెంపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపిన అనంతరం ప్రత్యేక రబీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలియజేశారు.
- ❖ గౌహతి వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భారత్ విజయానికి ఇంకా 187 పరుగులు చేయాల్సి ఉంది.

==========================

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫలప్రదమైన చర్చలు జరిపినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతలు, ఇతర రంగాల్లో భారత్-అమెరికా ద్వైపాక్షిక సహకారాన్ని ఫోన్ సంభాషణలో సమీక్షించినట్లు పేర్కొన్నారు. భారత్-అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహిత సంప్రదింపులను కొనసాగించాలని ఇరువురు అంగీకరించినట్లు ప్రధానమంత్రి తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరువురం అభిప్రాయాలను పంచుకున్నామని, ప్రపంచ శాంతి, భద్రతను పెంపొందించేందుకు కొనసాగుతున్న ప్రయత్నాలపై కూడా చర్చించినట్లు నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమ పోస్టులో వెల్లడించారు.

==========================

రబీ పంటల కనీస మద్దతు ధరల పెంపుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల కమిటీ 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి అన్ని నిర్దేశిత రబీ పంటల కనీస మద్దతు ధరలను పెంచేందుకు ఆమోదం తెలిపింది. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీలో పాత్రికేయులకు ఈరోజు వెల్లడించారు. కుసుమ పంటకు క్వింటాల్‌కు 675 రూపాయల చొప్పున అత్యధికంగా ఎంఎస్‌పీ పెంచినట్లు చెప్పారు. ఆ తర్వాత ఆవాల పంటలకు క్వింటాల్‌కు 413 రూపాయలు, కందిపప్పుకు 390 రూపాయలు, బార్లీకి 136 రూపాయలు, శనగకు 83 రూపాయలు, గోధుమలకు 25 రూపాయల చొప్పున కనీస మద్దతు ధర పెంచినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

అదే విధంగా ఢిల్లీ పోలీసుల ఆధ్వర్యంలో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) ప్రాజెక్టును అమలు చేసేందుకు కూడా క్యాబినెట్  కమిటీ ఆమోదం తెలిపిందని చెప్పారు. పన్నులతో కలిపి ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 1,789 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రబీ పంటలకు కనీస మద్దతు ధరను పెంచుతూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా రైతుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పెంచిన ఎంఎస్‌పీ రైతులకు మెరుగైన ఆదాయాన్ని అందించడంతో పాటు.. వారి సుసంపన్నతకు దోహదపడుతుందని తెలిపారు. అన్ని రాష్ట్రాల అధికారులు, మంత్రులతో విస్తృతంగా సంప్రదింపులు జరిపిన అనంతరం వ్యవసాయ మంత్రిత్వ శాఖ రాష్ట్రాల వారీగా ప్రత్యేక రబీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందని శివరాజ్ సింగ్ చౌహాన్ న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులకు వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పర్యాటక రంగం కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రధాన స్తంభంగా, ఉపాధికి ముఖ్యమైన వనరుగా నిలుస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అసోచామ్ ఈరోజు నిర్వహించిన జాతీయ పర్యాటక సదస్సులో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... ప్రపంచ వ్యాప్తంగా నేడు భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఉన్నప్పటికీ పర్యాటకరంగం మాత్రం వృద్ధిని కొనసాగిస్తోందని చెప్పారు. గత ఏడాది దేశంలో దేశీయ పర్యాటక రంగం 12.5 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని, దేశ వ్యాప్తంగా 428 కోట్లకు పైగా పర్యాటకులు సందర్శించారని మంత్రి తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో రేపు జరగనున్న ముగింపు ఉత్సవాల్లో ప్రధానమంత్రి పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, స్మారక తపాలా బిళ్లను విడుదల చేయడంతో పాటు "100 ల్యాండ్‌మార్క్ జడ్జ్‌మెంట్స్ - షేపింగ్ ది పాలసీస్ ఆఫ్ యూపీఎస్సీ అండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ ఇన్ ఇండియా" అనే పుస్తకాన్ని కూడా ఆవిష్కరిస్తారు. 1926లో యూపీఎస్సీ ఏర్పాటై వందేళ్లు పూర్తయిన సందర్భంగా గత సంవత్సరం అక్టోబర్ ఒకటో తేదీన ప్రారంభమైన ఏడాది కాలం ఉత్సవాలు రేపటి కార్యక్రమంతో ముగియనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

క్వాంటమ్ సెక్యూర్ కమ్యూనికేషన్ రంగంలో భారత్ కీలక మైలురాయిని సాధించిందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. దేశ సాంకేతిక సామర్థ్యాలు వెయ్యి కిలోమీటర్లకు పైగా క్వాంటమ్ సురక్షిత కమ్యూనికేషన్‌ను అధిగమించాయని ఆయన చెప్పారు. ఎనిమిదేళ్లలో సాధించాలని నిర్దేశించుకున్న లక్ష్యంలో సగానికి పైగా పురోగతిని మూడేళ్లలోపే సాధించినట్లు మంత్రి వెల్లడించారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన నేషనల్ క్వాంటమ్ మిషన్ 'ప్రగతి క్యూ ఫౌండ్రీ' కార్యక్రమం ప్రారంభ సమావేశంలో పాల్గొన్న జితేంద్ర సింగ్ ఆ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం జాతీయ క్వాంటమ్ మిషన్ పరిధిలో 14 సాంకేతిక బృందాలు, 17 ప్రాజెక్టు బృందాలు, 150 మందికి పైగా ప్రత్యేక పరిశోధకులు, 17 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 43 సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ సందర్భంగా జాతీయ క్వాంటమ్ మిషన్ కింద 9 కొత్త స్టార్టప్‌లను కూడా జితేంద్ర సింగ్ ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అసోంలోని గౌహతి స్టేడియం వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో వండే క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్... భారత్ కు 406 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన భారత్ కు శుభారంభ లభించింది. ఓపెనర్లు శుభమాన్ గిల్ సెంచరీ, రోహిత్ శర్మ 80 పరుగులు చేసి క్రీజులో కొనసాగుతున్నారు. దీంతో 23 ఓవర్లు పూర్తయ్యేసరికి భారత్ 219 పరుగులు చేసింది. విజయానికి ఇంకా 187 పరుగులు చేయాల్సి ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడల్లో ఈరోజు కూడా భారత్ అథ్లెట్లు విజయ పరంపర కొనసాగించారు. ఆర్చరీ కాంపౌండ్ ఈవెంట్లలో టీమ్ అండ్ మిక్స్‌డ్ విభాగంలో భారత్‌కు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. దీంతో భారత్ పదకొండో రోజును కూడా స్వర్ణ పతకాలతో ప్రారంభించింది. అలాగే ట్రాప్ మిక్స్‌డ్ షూటింగ్ టీమ్ విభాగంలో కూడా భారత్‌కు స్వర్ణ పతకం వచ్చింది. ఇక పురుషుల రెజ్లింగ్ 87 కిలోల విభాగంలో భారత రెజ్లర్ సుశీల్ కుమార్ కాంస్యం సాధించాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), భారత కోస్ట్‌గార్డ్, కేంద్ర నిఘా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఇరాన్‌కు చెందిన ఓ పడవ నుంచి ఐదుగురు పాకిస్థానీ పౌరులను అరెస్టు చేసినట్లు కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా తెలిపారు. భారత ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలో ఉన్న ఆ పడవ నుంచి 526 కిలోల మెథాంఫెటమైన్, హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన సామాజిక మాధ్యమ పోస్ట్ లో వెల్లడించారు. దేశ యువతను మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =